# కెటిల్

**(Kettle)**

పొగ ఇల్లంతా పొగ, పొగ నడికొప్పు దాకా సుళ్ళు తిరుగుతోంది. మసి కొట్టుకు పోయిన కప్పులో అక్కడక్కడ బూజు దారాలు వేలాడుతున్నాయి – దరిద్రానికి సంకేతాల్లా.

పొయ్యి మీద "కెటిల్". కెటిల్ క్రింద తడికట్టెలు.

మండకుండా ఏడిపిస్తున్నాయి – ఇంటి చుట్టూ తిరుగుతూన్న పోలీస్‌ల్లా, గుండెలోని ఊపిరులన్నీ కూడగట్టుకొని "ఉఫ్" మని సుదీర్ఘంగా ఊదాడు అతను, "గప్" మని మంట లేచి మళ్ళీ ఆరిపోయింది.

మళ్ళీ పొగ.
ఇంటినిండా పొగ.

పొగలో కళ్ళు కనబడటం లేదు. ఊపిరాడడం లేదు. కళ్ళు నలుపుకొంటూ తడిక బయటికొచ్చాడు అతను. అప్పుడే తెల్ల వారుతోంది.

పొగలు.
ఎమర్జెన్సీ పొగలో ఊపిరాడని ప్రజలు.

ర్రయ్ ర్రయ్ మంటూ తిరుగుతున్న పోలీసు వ్యాన్లు.

"టక్–టక్" అంటూ కదులుతూన్న, పోలీసు బూట్ల కదలికలు. మునిసిపాలిటీ వాళ్లు కుక్కలను ఎక్కించుకు పోయినట్లు ఇనుపజల్లెడలున్న "బ్లూ" పోలీసు వ్యాన్లు మనుషులను ఎక్కించుకుపోతున్నాయి.

"ఇంక్విలాబ్... జిందాబాద్..."

"విప్లవం... వర్ధిల్లాలి".... పరుగెత్తుతూన్న పోలీసు వ్యాన్లు అరుస్తున్నాయి. తన హోటల్ ముందుగా పోలీసు వ్యాన్లు వెళ్ళిపోయాయి. మలుపు తిరిగిందాక రెప్ప వాల్చక వాటివైపు చూశాడు అతను – లుంగీ నడుంపైకి ఎగ కట్టుకొని.

పోలీసువ్యాన్లు కనుమరుగై పొయ్యాయి. పోతున్న వాటి వైపు చూశాడు. పోలీసు వ్యాన్లలో విద్యార్థుల కంఠాలు ఉద్విగ్నంగా అరుస్తున్నాయి.

"ఏమాయనయ్యా.... ఛాయి ఏం జేత్తివి," ఛాయికి ఆర్డరిచ్చిన, నల్గురు ప్రయాణీకుల్లో, ఒకరు హెచ్చరించారు.

నాల్గు వైపులా నాల్గు మేకులు భూమిలో పాతి దానిపై అమర్చిన బెంచీలాంటి చెక్కలు. వాటిపై కాళ్లు పెట్టుకొని కూర్చొన్న ప్రయాణీకులు "టీ" కోసం ఎదురుచూస్తున్నారు.

వాళ్ళ మాటలు పట్టించుకోలేదు అతను.

అతని కళ్ళలో ఆవేదన - గిరుక్కున వెను తిరిగి తడక దాటి లోనికెళ్ళాడు.

అది రెండు నిట్టాడులపూరిల్లు. ఒక నిటాడిభాగంలో సంసారం రెండవ భాగంలో కిచెన్. దానికి ఎదురుగ్గా ఉన్న బెంచీల్లాంటి చెక్కలు - మనుషులు కూర్చోటానికి. ఆ బేంచీలకు బయట వైపు బొంగులకు హోటల్ సైన్ బోర్డు వ్రేలాడుతోంది.

"నవయుగ టీ స్టాల్"

ప్రొ॥ వీరయ్య అన్న అక్షరాలు రంగు పోయి అస్పష్టంగా కనిపిస్తున్నాయి. గాలిలో ఊగుతున్న ఆ బోర్డు ఇప్పుడో అప్పుడో తెగిపడటానికి సిద్ధంగా ఉంది. దానికి సరిగా క్రింద నేలపైన బక్కెటు ఉంది - నీళ్ళు నింపి.

దాని ప్రక్కన పెద్ద నాపరాతి బండ.

"మన మల్లయ్యను పోలీసుల మెటారులో ఎక్కించుకొని ఎక్కడికో తీసుకొని పోతున్నారు. ఇంకా వాని జంటకు స్టూడెంట్ పోరగాళ్ళున్నారు" లోపలివైపు తడిక భాగంలో కూర్చున్న భార్యనుద్దేశించి వీరయ్య అన్నాడు.

"ఇందాకటి లొల్లి అదేనా?....., స్టూడెంటు పోరగాళ్ళు పొద్దుపొద్దున్నే అరుసుకుంటూ పోతున్నారు.... ఏందో అనుకున్నా!...." శనగ పిండి పిసుకుతున్న అతని భార్య పళ్ళెం అవతలకి జరిపి లేచి నిలబడ్డది. లోపల 'ఛాయి' గ్లాసులు కడుగుతున్న ఇద్దరు ఆడ పిల్లలు తమ తండ్రి పెదవులపైన దృష్టి నిలిపారు.

"మన మల్లయ్యేనా? నువ్వు సరిగా చూశావా?".... ఆమె కంఠంలో ఆవేదన. "వలేసి చేపలు పట్టుకున్నట్లు పట్టుకున్నారు. నిన్న రేత్రి మనోన్ని పట్టుకున్నాక, రేత్రి రేత్రి పిల్లగాల్లందర్నీ నిద్రమంచాల మీద లేపుకొచ్చి రాత్రంతా పోలీసుటేషనులో ఉడ్డాపెసినట్టుంది. ఇప్పుడు వాళ్ళందర్నీ ఎటో తీసుకుపోతాన్రు మల్లీ... ఇప్పుడు నువ్వు ఇన్నా ఆ కేకలు.... అదుగో పిల్లగాళ్ళ కేకలు... ఇను... ఇంకా ఇనొత్తున్నాయి".... అతను మెడ పక్కకు వంచి చెవులు రిక్కించాడు. అతనితో పాటు భార్య పిల్లలూ, ముగ్గురూ, కళ్ళు పెద్దవి చేసుకొని దూరదూరంగా వెళ్ళిపోతూన్న నినాదాలను వినసాగారు.

.... అప్పుడే మేల్కొంటున్న పట్టణపు వీధుల్లో నుండి క్రమేపి నినాదాలు వినిపించకుండా పొయ్యాయి.

మళ్ళీ నిశబ్దం - స్మశానం లాంటి నిశబ్దత.

ఎవరి పనులు వాళ్ళు చేసుకోసాగారు. పొయ్యిలో కట్టెలు ఎగదోసి మళ్లీ గట్టిగా ఊదసాగాడు. ఊదుతున్న కొద్దీ నిప్పురాజుకో సాగింది. రాజుకొంటున్న నిప్పు రవ్వలు పొగతో పైకి లేచి, పైపైకి పోసాగాయి.

అతని కనుబొమ్మలపై బూడిద రేణువులు.
అతని కళ్ళల్లో మంటలు... జ్వాలలు.
"పిల్ల గాళ్ళను యాడికి తీసుకెల్లారంటావ్?"..... ఆమె అంది.

"నర్సంపేట డాక్ బంగలాకో లేకపోతే పాకాల చెరువు డాక్ బంగలాకో... మరి నాకు మాత్రం ఏం తెలుసు"... సమాధానమిచ్చాడు అతను.

"ఏమాయనయ్యా.... నువ్వు 'ఛాయి' తెచ్చేలోగా మాకు 'రాయగూడెం' బస్సు దాటిపోతది"... "టీ" కోసం ఎదురుచూస్తున్న ప్రయాణీకుల్లో ఒకరు మళ్ళీ హెచ్చరించాడు.

"ఇగ్గో... వత్తన్నా...."

"ఛాయి సింగిలా.... పుల్లా"... గ్లాసులోకి కెటిల్ వంచుతూ వాళ్ళను ప్రశ్నించాడు.

"సింగిల్".... సమాధానం.

గ్లాసులో సగానికిపైగా 'టీ' వంచి వాళ్ళిచ్చిన రూపాయి జేబులో వేసుకొని 'కెటిల్' ను మళ్ళీ పొయ్యిమీద పెట్టి భార్యకేసి తిరిగాడు.

''ఏదో ఒక రోజు మన మల్లయ్యను పోలీసులు పట్టుకుపోతారనుకొన్నదేగా" ఇయ్యాల ఆ రోజు వచ్చిందనుకో"…. భార్యను ఊరడించే ప్రయత్నంలో సంభాషణ ప్రారంభిస్తూ పలికాడు.

ఆమె పిండి పిసుకుతున్న బేసిన్‌ను ప్రక్కకుపెట్టి నిశ్చలమైన చూపులతో గోడకేసి చూస్తూ కళ్ళు ఒత్తుకోసాగింది. పిండిపిసికిన వేళ్ళు తెల్లగా ఎండిపోసాగాయి. భర్త మాటలు విని చూపు మరల్చుకుంది. కళ్ళు పెద్దవి చేసుకొని నిశ్చలంగా అతనిని చూడసాగింది.

"ఎందుకిలా మిడిగుడ్లు పెట్టుకుని సూత్తావ్?…. నల్గురితో నారాయణ అన్నారు. అందరి పిల్లలతో పాటు మనవాడు. నువ్వొక్కదానివే కన్నావా కొడుకుని? ఈ లోకంలో అందరి తల్లుల్లో నీ వొక్కదానివి…. పిండి గలుపు…. పిండి గలుపు… అడికోసం ఏడుత్తాకూసుంటే తిండొత్తదా ఏంది? ఏం సేత్తారీ పోలీసులు… నాల్గు రోజులు లాకప్‌లో కూసోబెట్టి ఇడిసి పెడతారు. లేకపోతే ఈల్లందరికీ కూడూ, కుమ్మూ సూడాలంటే పెబుత్వానికి మాత్తరం మాటలంటే"…

తన మనో వ్యధను ఆమె పసికట్టకుండా జాగ్రత్తపడుతూ, ఆమెను ఊరడించే ప్రయత్నంలో నిర్లక్ష్యంగా మాట్లాడసాగాడు.

"అసలు వాడినని లాభంలేదు…. నిన్ననుకోవాలి… నువ్వే వాడికి రాజకీయాలు నేర్పిపెట్టింది. ఏ ఇంటిలోనైనా తండ్రైనవాడు "మనకీ రాజకీయాలొద్దు - పార్టీలొద్దని"…. కొడుకుని మందలించి బుద్ధి సెబుతాడు. మన కొంపలో ఇదొక ఇడ్డూగం. వాడ్ని కన్న నువ్వే వుుందురుకుతావ్. ఇదొక ఇపరీతం. ఏ పార్టీ ఏ గంగలో కలిత్తే మన కేంది? ఎంగిలి గిలాసలు కడుక్కుని బతికే వాల్లం. మన కెందుకీ రాజకీయాలు?…."

"అదే నేనూ, అంటన్నాను… ఈ ఎంగిలి కప్పులు, గిలాసలు ఎన్నాల్లు కడగాలని. ఈ దేశం మారాలి. ఈ దేశంలో బూమీ పుత్రా మనందరివీ కావాలి. ఈ దేశం ఎవడి తాతగాడి సొమ్ముకాదు తెలుసా?" ఈ వ్యవస్థ మీద కోపంతో కుతకుతలాడి పోయాడు.

తడికకు ఓరగా అనుకొని భర్తను చురచురా చూడసాగింది. రెండు నిమిషాల మౌనం పిమ్మట అతను పెదవులు లోనికి ఒత్తుకొని మళ్ళీ పలికాడు కోపం తగ్గించుకొని.

"నీకు కడుపు తీపి అట్టని పిత్తంది కానీ, నాకయితే అది గూడలేదే? పేదపెజలం.... మనమే సెయ్యకపోతే, మనకోసం దబ్బున్న వాళ్ల పిల్లలు, గొప్పోల్ల పిల్లలూ త్యాగాలు సెయ్యరు... ఎంతమంది డాక్టరు బాబులూ, ఎంతమంది ఇంజనీరు బాబులూ నేలకొరిగి పోలేదు. మన మల్లయ్యను కూడా దేశం కోసం ఇడిసిపెడదాం... మనం మనసు సంపుకోవాలి....."

అతని కళ్ళలో తిరుగుబాటు కిరణం

అతని మాటల్లో పొంగులు వారుతూన్న ఆవేశం. గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

వీరయ్యకు యాభైఏళ్ళకు పైబడినాయి. యాభై ఏళ్ళు పైబడినా వీరయ్యకు కండబలం తగ్గలేదు. గుండెబలం సంగతి వేరే చెప్పవలసిన పనిలేదు. ఎన్నిసార్లు పోలీసులు స్టేషనుకు రమ్మన్నా విసుగు విరామం లేకుండా స్టేషన్‌కు పోతూనే ఉంటాడు. పోలీసులు లోగడ ఎన్నోసార్లు తన కప్పులూ సాసర్లూ, గ్లాసులూ రోడ్డుమీద పడవేశారు. హోటల్‌లో బెంచీలు, తడికలూ ఊడదీసి కుప్పబెట్టారు.

అయితే నేం?

పోలీసులు వెళ్ళిన మరుక్షణంలోనే తను అన్నీ సర్దుకొని మళ్ళీ "టీ" అమ్ముకొనేవాడు. ఆయన తన చిన్నతనం నుండే ఎర్ర జెండా పట్టుకొన్నాడు. ఉగ్రవాద రాజకీయ పక్షం వైపు వెళ్ళాడు. అదే కారణంగా తన హోటల్ పోలీసు రెయిడ్స్‌కు, మున్సిపాలిటీ దాడులకు గురికాక తప్పలేదు.

తన హోటల్ – "నవయుగ టీస్టాల్" తనకు గర్వకారణం. ఖమ్మం పట్టణపు నడిబొడ్డుపై ఉన్న ఈ "టీ" స్టాల్ కేవలం "టీ" స్టాల్ కాదు. ఇది రాజకీయాల రచ్చబండ.

సమాజంలో మార్పు కోరే విద్యార్థులకు, విప్లవ మేధావులకు, ఇది కూడలి. కర పత్రాలకు ఇది నిలయం.

తను పెద్దగా చదువుకోకపోయినా, కర పత్రాలు పంచి పెట్టటం – గోడల మీద వ్రాయటానికి రంగు డబ్బాలూ, నిచ్చెనలు మోయటం – బహిరంగ సభలకు బొంగులు పాతి మీటింగు సన్నాహాలు చెయ్యటం – అలగా జనాన్ని బహిరంగ సభలకు పిలుచుకురావటం – మొదలైన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఉద్యమానికి తాను చెయ్యగలిందంతా చేశాడు. తత్ ఫలితంగా

తన హోటల్ పోలీసు "నిఘా"కు గురై, తను పోలీసు చిత్రహింసలకు గురై, ఎన్నో కష్ట నష్టాల పాలయ్యాడు.

అయినా....

తను చలించలేదు. తన పంథాను మార్చుకోలేదు. పోలీసులకు లొంగిపోయి పోరాటాన్ని విస్మరించలేదు. బ్రతుకుతో రాజీపడి తన ఆశయాన్ని ఒదులుకోలేదు.

నిన్న అర్ధరాత్రి తన కొడుకుని పోలీసులు అరెస్టు చెయ్యటం వలన తాను కొంత చలించినా గుండె నిబ్బరం చేసుకొని వేకువజామున లేచి తన వృత్తి ధర్మంలో నిమగ్నమై పొయ్యాడు. కానీ మనస్సు మాత్రం పని మీద నిమగ్నం కావటం లేదు.

"కెటిల్" క్రింద కట్టెలు ఎగదోసి తనకు ఎదురు కాబోయే అనివార్యమైన బాధలను ఊహించుకుంటూ వీధుల్లోకి చూశాడు.

చిన్న చిన్న బోడి కొండల మధ్య నుండి సూర్యుడు ఆకాశానికి ఎగబ్రాకుతున్నాడు. రిక్షాల సంచలనం మొదలైంది వీధుల్లో నడుములు విరిగే గంపలు నెత్తిన పెట్టుకొని కూరగాయల వాళ్లు మార్కెట్టు వైపు చక చకా నడుస్తున్నారు. ఇంగ్లీషు, తెలుగు దిన పత్రికలు ఇళ్ళలోకి విసిరిపోతున్నాయి సైకిళ్లు. టర్నింగ్‌లో ఉన్న ఎయిర్ కండిషన్డ్ హోటల్ ముందు, వృత్తి రీత్యా రాజకీయ నాయకులైన పెద్ద మనుషులు పేపర్లలో తలలు దూర్చి, కారా కిళ్లీలతో పాటు రాజకీయాలను నమిలి బజార్లన్నీ ఎర్రగా ఊసి పారేస్తున్నారు.

తన హోటల్ దగ్గరగా కారు ఆగుతూన్న శబ్దం విని భుజాలమీదుగా తలతిప్పి వెనక్కి తొంగి చూశాడు.

పోలీసు వ్యాన్! – ఖాదీ బట్టలు.

భుజాలపై రెడ్ రోప్స్... బ్లూరోప్స్... ప్రక్కనే ఇంగ్లీషు అక్షరాలతో ఇత్తడిబిళ్ళలు వారి వారి హోదాలు భుజాలపై ధగధగా మెరుస్తున్నాయి. అందరు ఒక్కసారే దిగి ఎట్మాస్ఫియర్ క్రియేట్ చేస్తున్నారు.

"నువ్వేనా వీరయ్యంటే"... అన్నాడు.

"అయ్యా",...

"ఛాయి" అమ్ముకొని భార్యా పిల్లలను చూసుకోక, అన్నీ నఖరాలు... నీకేందుకీ రాజకీయాలు.... ఏమేమి పుస్తకాలు దాచి పెట్టావ్ లోపల"...

"పుస్తకాలు పోయినసారీ రేయిడ్స్ జరిగినప్పుడే అన్నీ పట్టుకెళ్లారు.... ఇప్పుడేమీ లేవు సార్!...

"లెవ్వనక, ఉండయ్యంటార్రా! మీ రోజులు దగ్గరపడ్డాయి. బిడ్డా"... రెయిడ్ కోసం కనుసైగ చేశాడు.... లాఠీకర్రను లోనికి చూపించి.

బిలబిల మంటూ పోలీసులు లోనికి పొయ్యారు.

రంగుపోయిన పాత ట్రంకుపెట్టెలు, జాజి చెక్క పెట్టె తీసికొచ్చి నడి వీధిలో పడవేశారు ఆఫీసర్ ముందు. వాటిల్లో వెలిసి ఉన్న పాత గుడ్డల మధ్య నుండి పాత కర పత్రాలు, భగవత్ సింగ్ జీవిత చరిత్ర, నాల్గయిదు తరగతులకు చెందిన టెక్స్టుబుక్కులు చిన్న పిల్ల దస్తూరితో.... పోలీసు ఆఫీసర్ గారికి అందించారు ఇద్దరు కానిస్టేబుల్స్ ఆ పుస్తకాల పేజీలన్నీ తిరగ వేసి ఒక నిర్ణయానికొచ్చిన ఆఫీసర్ గారు పోలీసు వ్యాన్‌లో పెట్టమని ఆజ్ఞాపించాడు.

"ఎక్కు... వ్యాన్‌లో కూర్చో"...

తోటి మానవునికి జరిగే అన్యాయాన్ని ప్రతిఘటించాలనే చైతన్యం లేని అమాయకులైన ప్రజలు అప్పటివరకూ అల్లంతదూరాన నిలబడి ఆ తతంగమంతా నిక్కి నిక్కి చూసి, పోలీసు వ్యాన్‌కు దారినిస్తూ ప్రక్కకు తప్పుకున్నారు.

.......

సెంట్రల్ ప్రిజన్ – వరంగల్

జైలు లోపల....

ఎత్తయిన జెయిలు గోడల మధ్య విముక్తి కోసం గింజుకుంటున్న మానవులు.

పీడిత జన విముక్తి కోసమై, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసమై పోరాటం సలిపిన వ్యక్తులు కటకటాల వెనుక మ్రగ్గిపోతున్నారు.

ఓ రోజు ఉదయం.

ఎనిమిదిన్నర గంటలు, డిటెన్యూలందరూ కాఫీగ్లాసులు ఓచేత్తో పట్టుకొని మరో చేత్తో కంచాలు పట్టుకొని పాలకూర మళ్ళల్లో కూలబడ్డారు – ఉదయపు లేత ఎండలో. పాలకూర మళ్ళలో ఖైదీలు పారలతో తవ్వుకుంటూ మళ్ళు కడుతున్నారు.

"కొత్త డిటెన్యూలు వచ్చారంట గేటులోకి...."

మళ్ళల్లో కూర్చుని నింపాదిగా కాఫీ తాగుతూన్న డిటెన్యూల మధ్య ఈ వార్త ప్రేలింది.

"వెరీగుడ్... దట్స్‌ఫైన్... ఫైన్"

"బాగుంది చాలా బాగుంది..." గోల.... గందరగోళం. కంచాలు కొట్టిన శబ్దం. ఏడ్వలేక నవ్వుతున్నట్లుగా గొల్లున నవ్వులు. అర్థంలేని పిచ్చినవ్వులు. నవ్వవలసిన అంశం కాదది. నవ్వును ప్రేరేపించే విషయం కాదది.

"నీయవ్వ.... ఇంకా ఎంతమందిని తీసుకొస్తారో లోనికి. ఈ రకంగా రోజుకి ఇద్దర్నీ ముగ్గుర్నీ లోనికి పంపిస్తే ఈ జైలు చాలొద్దూ?

"ఈ జైలు చాలకపోతే ఇంకా పది జైళ్ళు కట్టించుకుంటారు... నీ వెందుకు దిగులు పడతావ్? డబ్బు చాలకపోతే అమెరికా నుండో, రష్యానుండో అప్పు తెచ్చుకుంటారు వాళ్ళు... నీకేమిటంట బాధ." మరొకరి సమాధానం.

మళ్ళీ నవ్వులు – కేకలు.

"కొత్త డిటెన్యూలు వచ్చారని ఎవరు చెప్పారు ఇంత పొద్దుగాల."

"రెహమాన్ చెప్పాడు."

"అయితే రెహమాన్ వద్దకు పోదాంపదండి."

కూరపొదల్లో నుండి లేచి, లుంగీలు దులుపుకొని అందరూ "పోలో"మని యు.టి. వార్డు వైపు నడిచారు. యు.టి. వార్డంటే అండర్ ట్రయిల్స్ వార్డని దాని పూర్తి పేరు. శిక్ష పడకముందు విచారణ నిమిత్తమై తీసుకురాబడిన వ్యక్తుల కోసమై ఏర్పర్చిన వార్డు. డిటెన్యూలు అధిక సంఖ్యలో రావటం వలన ఆయా వార్డులను ఖాళీ చేయించి డిటెన్యూలకు కేటాయించారు. యు.టి. వార్డులో అర్ధ చంద్రాకారపు ముఖ ద్వారం. ముఖద్వారంలో బిగించబడిన ముదురుపచ్చరంగు తలుపు.

తలుపు ఓరగా తెరిచి ఉంది.

రెహమాన్ జైలు పోలీసు సిబ్బందిలో ఒకడు. డిటెన్యూలకు కావలసిన బియ్యం, కూరగాయలు, సిగరెట్లు తదితర అవసరాలను కొనుగోలు చేసి

లోనికి సరఫరా చెయ్యటానికి నిర్దేశించబడిన కానిస్టేబుల్. ఇతను అందరితో కలుపుగోలుగా ప్రవర్తిస్తుంటాడు. మెడలు వాల్చుకున్న కోళ్ళు అతని కుడి చేతిలో వ్రేలాడుతున్నాయి. మరొక చేతిలో కూరగాయల సంచి.

అప్పటికే అతని చుట్టూ కొందరు డిటెన్యూలు ప్రోగయ్యారు.

"కొత్తగా వచ్చిన వాళ్లు తండ్రి కొడుకులంట. ఇద్దరూ ఉగ్రవాదులేనని డిటెన్షన్‌లోకి పంపారు. తండ్రికి యాభై ఏళ్లుంటాయి. కొడుక్కి ఇరవై దాటి వుంటాయి. రాత్రి ఖమ్మం నుండి ట్రెయిన్‌కు తీసుకవచ్చారు. డిటెన్యూల జైలరు రాత్రి డ్యూటీలో లేనందున రాత్రంతా గేటు బయటనే ఉంచి ఈ ఉదయం లోనికి తీసుకొచ్చారు - వాళ్ళను".... రెహమాన్ చెప్పుకుపోతున్నాడు.

"అయితే, తండ్రి కొడుకులు వచ్చారన్న మాట.... రేపు అతని భార్యనీ తతిమ్మా పిల్లలను కూడా జైల్లో పెట్టేస్తారు.... ఇక వాళ్ళు జైల్లోనే కాపురం పెట్టెయ్యవచ్చు" బొక్కినోటి పోలీసు ఛలోక్తి విసిరి, పళ్ళులేని తన చిగుళ్ళు బయట పడేలా పగలబడి నవ్వాడు.

గొల్లున నవ్వులు మళ్ళీ.

"ఏరీ? మరింకా పంపలేదే వాళ్ళని లోనికి" అతురతతో ఒక కంఠం అడిగింది.

"లోనికి కాకపోతే బయటికి పంపటానికా, వాళ్ళనిక్కడి తెచ్చింది" బొక్కినోటి పోలీసు మరొక "విట్" వేశాడు.

"అవిగో.... మంచాలొస్తున్నాయి." రెహమాన్ రేడియో రూమ్ వైపు దృష్టి మరల్చి అన్నాడు" అందరూ అటువైపు దృష్టి మరల్చారు

హాలు మూలలో ఆ రెండు మంచాలు ఏర్పాటు చేశారు.

అంతలోనే జెయిలర్ కొత్త డిటెన్యూలను వెంట పెట్టుకొని హాల్లో ప్రత్యక్షమయ్యాడు. రెండు రోజులుగా నిద్రాహారాలు లేక వాళ్ళిద్దరికి కళ్ళు లోనికి పీక్కుపోయి కాంతి విహీనంగా ఉన్నాయి. స్నానపానా ు లేక బట్టలు వెంట్రుకలూ ఎర్రదుమ్ముతో నిండి ఉన్నాయి. ముందు వ్యక్తి వయస్సు మళ్ళిన వాడు - మురికి లుంగీ, చొక్కాలో ఉన్నాడు. రెండవ వ్యక్తి యువకుడు గీతల పంట్లాం - స్లాక్ షర్ట్ వేసుకొన్నాడు.

"వీళ్ళిద్దరూ కొత్త డిటెన్యూలు - తండ్రి కొడుకులంట - ఈరయ్యగారు.... కొడుకు మల్లయ్య" పరిచయం చేసిన జెయిలర్ వెళ్లిపోయాడు.

తండ్రీ కొడుకులిద్దరూ బిక్కముఖాలు వేసుకొని చుట్టూ ఉన్న జనాన్ని పరిశీలనగా చూశారు. వాళ్ళను చూడటానికి సమావేశమైన పాత డిటెన్యూలు మంచాలపై చతికిలబడ్డారు. కొత్తగా వచ్చిన తండ్రి కొడుకులకు స్నానానికి టవలు, సబ్బు అందిచారు. వాళ్ళు స్నానం ముగించుకొని వచ్చాక వారిని బయట పరిస్థితిని గూర్చి, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను గూర్చి, ప్రభుత్వ అణిచివేత చర్యలను గూర్చి వివరాలు తెలిసికోవాలని, ఏవేవో ప్రశ్నలడగాలని వారి కుతూహలం. వాళ్లు స్నానం ముగించుకొనేలోగా. మెస్ లీడర్ వెంకన్న అందరికి ఛాయి సిద్ధం చేసి "కెటిల్" లో పోసి స్టూలుపై పెట్టాడు.

"స్టూలుపై కెటిల్"

దాని చుట్టూ వలయాకారంగా డిటెన్యూలు. అందులో ఇద్దరు యం.యల్.ఎ.లు, ఒక యం.యల్.సి తదితర ప్రముఖులు. ఈ ప్రముఖులతో ప్రారంభించి అందరికీ 'టీ' అందించాడు వెంకన్న.

త్వరలో స్నానం ముగించుకొని వచ్చిన యువకుడు మల్లయ్యకు వెంకన్న 'టీ' కప్ అందించాడు. ఒక్క గుక్కలో ఆ టీ గొంతులో పోసుకొని ఖాళీ కప్పు క్రింద పెట్టకుండా వేళ్ళ మధ్యనే పట్టుకొని ఆ 'టీ' చాలదన్నట్లుగా "కెటిల్" కేసి చూడసాగాడు.

ఆ అవస్థ గ్రహించిన వెంకన్న చొరవ తీసుకొని "ఇంకింత తాగుతావా?".... అని అడిగి కప్పు పొంగి పొయ్యేలా చాయ్ పోసాడు. చాయ్ తాగిన మల్లయ్య పాత డిటెన్యూల ఇంటర్వ్యూకి సిద్ధపడ్డాడు.

డిటెన్యూలు ఖమ్మం జిల్లాలోని రాజకీయ ఉద్యమాలను గూర్చి, ఘర్షణల పేరిట మరణించిన విద్యార్థులను గూర్చి, జైలుకు రిమాండ్‌కు పంపకుండా పోలీసు లాకప్పులో మ్రగ్గిపోతున్న విద్యార్థులను గూర్చి, విద్యార్థి ఉద్యమాలలో ఉన్న వైరుధ్యాలను గూర్చి ప్రశ్నలడిగారు.

అతను కొన్ని ప్రశ్నలు అర్థంకాక తికమకపడ్డాడు. తెలిసిన వాటికి క్లుప్తంగా ముక్తసరిగా సమాధానామిచ్చి, కొన్ని ప్రశ్నలను దాటవేసి, గోడ కానుకొని మౌనంగా కూర్చుని కూరిప్పాట్లు పడసాగాడు.

"రాత్రంతా నిద్ర లేనట్టుంది.... పొయ్యి పడుకో".... వెళ్ళటానికి అనుమతిచ్చారు.

స్నానం ముగించుకున్న వీరయ్యకు ఒక పెద్దగ్లాసులో 'టీ' సిద్ధం చేశాడు వెంకన్న. అతని సమయోచితమైన బుద్ధికి అందరూ అభినందనలు తెలిపారు.

"బీడీ కాల్చుకుంటావా?" – మర్యాద పూర్వకంగా అడిగాడు వెంకన్న.

"అవునన్నట్లుగా తల ఊపాడు. బీడీ ఇచ్చి అగ్గిపుల్ల గీచి ఆ బీడిని అంటించి ఇంకా ఎక్కువ మర్యాద చేసిన వెంకన్న తనొకబీడీ వెలిగించుకొన్నాడు. ప్రశాంతంగా నాల్గుగైదు దమ్ములు పొగ విడిచిన వీరయ్యను మెల్లగా మాటల్లో దింపారు మిత్రులు.

పిచ్చాపాటీ అంతా మాట్లాడారు రాజకీయ వాతావరణం గూర్చి. వీరయ్య మేధావి కాదు కాబట్టి డొంక తిరుగుడు సమాధానాలు చెప్పలేదు. అన్నిటికీ కుండ బద్దలు కొట్టినట్లు తెగేసి చెప్పాడు. ఎన్ని కష్టాలొచ్చినా "జెండాను" వడిచిపెట్టే ప్రసక్తే లేదన్నాడు. అత్యవసర పరిస్థితి ఎత్తివేసే ప్రశ్న లేదని ఒకవేళ అటువంటి అవకాశం ఉంటే దాని అమలుకు ఉత్తర్వులు జారీ చెయ్యవలసిన అవసరం లేదని తన భాషలో చెప్పాడు.

ఆ తరువాత సంభాషణ వ్యక్తిగత జీవిత విశేషాల వైపు మలుపు తిరిగింది.

"మరి... వీరయ్య గారూ!... నిన్నూ... నీ కొడుకునీ జైళ్లో పెడితే మరి ఇంటి వద్ద నీ భార్యకు, తతిమ్మా పిల్లలకూ తిండి తిప్పలు ఎవరు చూస్తారు"? జాలినిండిన కంఠం అడిగింది మూలనుండి.

"ఎవరు సూత్తారంటే ఏమని చెప్పను.... మామూలుగా నేను ఇంటి కాడున్నప్పుడు. వాళ్ళను సుకంగా కూసోబెట్టి సాకలేదు. గొప్ప కుటుంబాలలోని ఆడవాళ్ళ లాగా. వెనక గదిలో నా భార్య 'ఛాయి' చేస్తది. దానిని నేను 'కెటిల్' లో నింపుకొని బజారులో ఉన్న దుకాణాల గుమస్తాలకు అమ్ముతాను. అదపాదడపా బస్సు దిగిన వాళ్లు కూడా మా హోటల్‌కు వత్తారు. నాకు ముగ్గురు బిడ్డలు – సిన్నది బళ్ళోకిపోతాంది. వాళ్ళకు సిగ్గూ సిన్నతనమూలేవు. వారు తాగిన ఎంగిలి గిలాసలు సెకసెకా కడిగి నాకందిత్తారు. మాకు ఆ 'కెటిలీ'నే బతుకు.... అదే మా కన్న తల్లి....."

అయితే ఇదొక్కటే జీవనాధారమా?... ఇంకా భూమీ పుత్రా?..."

"అయ్యా! బూమీ పుట్రా ఉంటే ఇక లేనిదేముంది మాకు. ఈ "కెటిలీ" కాక ఇంకొక ఆధారం కూడా ఉంది. అదేందంటే కార్యం బోర్డు. కాలేజీ పిల్లగాళ్ళు పనీబాపాట లేని ఆవారాగాళ్ళు మా హోటల్ ముందు కూర్చొని రోజంతా 'లట లట' మని బిళ్ళలాడుతున్నారు. ఒక్కొక్క బోర్డుకు ఒక్క "చారానా" ఇస్తారు. రోజూ అయిదారు రూపాయలు తెచ్చి పెడతాది ఆ బోర్డు... అంతే ఆ కెటిలీ... ఈ క్యారం బోర్డు... ఇవే మాకు బూమీ.... పుట్రా...."

అయితే మీరిద్దరూ జైల్లో ఉన్నారు... ఆడ నీ భార్య "కెటిలీ" పుచ్చుకొని బ్రత్గలదంటావ్?" అవునా?

అవును... బతగ్గలదు... కానీ ఎటొచ్చి పోలీసులతోనే లొల్లి. మళ్ళీ సీకిరెట్టు పుస్తకాలున్నాయనో, పెబుత్వం బ్యాను జేసిన నాటకాలున్నాయనో లేకపోతే, నక్సలైట్లు రాత్రి ఈడ దాక్కున్నారనో... దాన్ని సతాయించక పోతే సరి... వాళ్ళతోనే కిరికిరి. గట్టిగా బీడి దమ్ములాగి పొగ విడిచి, బీడీ నూసి రాల్చుటనికై చిటికే వేసి కాళ్ళు ముడుచుకుని దీర్ఘాలోచనలో మునిగిపొయ్యాడు.

పోలీసోళ్ళకు ప్రజల ఆయువుపట్లు తెలుసు. వాటిని వాళ్ళు పట్టుకుంటారు. డబ్బు గుంజటానికి రాచిరంపాన పెట్టటానికి, ఆయువుపట్టు పట్టుకుంటారు... ఆ పట్టు పట్టారంటే... ఇక సూసుకోండి, రామసిలకను పిసికితే మాయలమరాటీ గిలగిలా కొట్టుకున్నట్లు"....

వాళ్ల డ్రైవర్ని సతాయించదలచుకుంటే – "సి" బుక్కు గుంజుకొని స్టేషన్‌కు రమ్మంటడు కానిస్టేబుల్ సాబ్.

ఏవ్వడైన రిక్షావాడు రాంగ్‌సైడు పోతే... సీటు చంకలో పెట్టుకొని మామూల్చిచ్చే వరకూ ఏడిపిస్తాడు.

కాలేజి పిల్లగాళ్లు డబుల్ సవ్వారి పోతే... వాల్ పిన్ను పీకి గాలి దీసి నిలబెడతాడు – రాజీ కుదిరేదాకా.

తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకునే వాళ్లు 'మామూలు' క్రింద కూరగాయలివ్వక పోతే. ఆ తక్కెడ, రాళ్ళూ లాక్కుని స్టేషన్‌లో పెడతారు... ఇక నా అసుమంటి చిన్న చిన్న 'టీ' కొట్టు వాళ్ళయితే ఆ కెటిలీని.... క్యారం బోర్డును స్టేషన్‌లో పెట్టి, అయిదో పదో సేతిలో పెడితే తప్ప ఇడిసి పెట్టరు... అదొక్కటే ఇబ్బంది... అంటూ బీడి చివరి దమ్ములాగి అవతల పడవేసి అందరి ముఖాల్లోకి చూశాడు, విసుగ్గా.

"పడుకోనియ్యండి... పడుకోనివ్వండంటూ" డిటెన్యూ సోదరులందరూ తమ తమ బ్యారక్స్‌కు వెళ్ళిపోయ్యారు.

జైల్లో రోజులు "రోడ్డు రోలర్"లా మెల్లిగా దొర్లి పోతున్నాయి. మార్పులేని రోజులు. కాలం గడ్డకట్టుకుపోయిన ఎత్తయిన కారాగారపు గోడల మధ్య ఉదయించని ఉదయాలు.....

ఆశల్లేని – రేపులు నిన్నటికి, ఈ రోజుకూ, రేపటికీ వ్యత్యాసంలేని రోజులు.

రాత్రి ఎనిమిది గంటలకు లాకప్ – కప్ప తాళాలతో బిగించిన తలుపుల వెనుక నిద్రపట్టని రాత్రిళ్ళు – అర్థం లేని పవళ్ళు.

.........

ఉదయం ఆరుగంటలకు లాకప్ నుండి – రిలీజ్.

ఆ రోజు ఉదయం యధాలాపంగా లాకప్ తాళాలు నోళ్ళు తెరుచుకున్నాయి. డిటెన్యూలు కాలకృత్యాలు తీర్చుకొని గ్లాసులు పట్టుకొని, డైనింగ్ హాలులో బేంచీలపై, టేబుల్స్‌పై వివిధ భంగిమలల్లో కూర్చున్నారు. మెస్ లీడర్ వెంకన్న అందరికీ "టీ" పోసి, "కెటిల్" బల్ల మీద పెట్టి కిచెన్‌లోనికి వెళ్లాడు. వార్డర్ వచ్చి ఉత్తరాలు అందించి వెళ్ళాడు.

గత రెండు రోజులుగా ఎడతెరపిలేని ముసురు.

బయట కాలుపెట్టటానికి వీలులేకుండా జైలు ఆవరణ అంతా తడి తడిగా ఉంది ఆ రోజు సూర్యుడు కనిపించి బయట నీరెండ కాయసాగింది. వెచ్చదనం కోసమై డిటెన్యూలు "టీ" గ్లాసులు పట్టుకొని ఎండలో వరుసగా కూర్చున్నారు గోడ ప్రక్క.

వీరయ్య ఒక్కడే డైనింగ్ హాలులో కూర్చున్నాడు – కెటిల్‌పై చూపు నిలిపి.

టీ త్రాగటం మర్చిపోయి అలాగే దిగాలుపడి చూడసాగాడు.

"ఛాయి తాగు ఈరన్నా... ఇంటి కాడ మనుషులు యాదికొచ్చిన్రా! అంతే వస్తారు తియ్యి.... రెండు రోజులు పోతే అన్నీ అలవాటయిపోతయి. ఇంటి కాడ పెళ్లాం పిల్లల్నీ తలుసుకొని గుండె బగిలి చావటం కన్న ఇక్కడున్నన్నాళ్ళూ వాళ్ళను మరిసి పోవటమే మంచిదని నా నమ్మకం." కిచెన్‌లో పొయ్యి వద్ద నిలబడిన వెంకన్న బయటికి తొంగి చూస్తూ వీరయ్యను హెచ్చరించాడు.

ఉలుకూ పలుకూ లేకుండ వీరయ్య 'కెటిల్' కేసి చూడసాగాడు. అతని కుడిచేతివేళ్ళ మధ్య నలుగుతోంది-ఉత్తరం. అతని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరుగుతున్నాయి. "కిచెన్"లో నుండి వ్యాపించిన పొగ డైనింగ్ హాలులో చుట్టుకోసాగింది. "ఈకవ లాక్కున్న కట్టెలు దమ్ముగొని సచ్చినట్టున్నాయి. రాత్రి పడుకోబొయ్యే ముందు లోపలేసుకోవాల్సింది" - అంటూ వెంకన్న కళ్ళు నులుముకుంటూ డైనింగ్ హాలులోకి వచ్చాడు.

"ఈరన్నా... ముఖమంతా అట్టా మారిపోయిందేమయ్యా!" - అరే ఉత్తరం, వచ్చినట్టుంది.... ఏం సంగతి?... ఇంటి వద్ద విశేషాలేమిటి? అంతా మంచిగా ఉన్నారంటనా?"... అడిగాడు.

"మన బతుకులు మంచిగా ఉంటాయా ఎంకన్నా?... ఈ గడ్డ మీద పుట్టిన మనుసుల్లో పెట్టి పుట్టిన వాళ్ళు కొందరున్నారు. తాత ముత్తాతల కాడ్నించి, ఆస్తులూ, అధికారాలూ వాళ్ళ సేతుల్లోకి వత్తుంటాయి. ఇక నా అసుమంటి అలగాజనం ఉన్నారు. రెక్కాడితేగని డొక్కాడని జనం. మన బతుకులు మారాలంటే ఇంకా ఎన్ని తరాలు మారాలో తెలియదు.... దున్నుకొని బతుకుదామంటే చారెడు బూమి లేదు. ఏదైనా ఉద్యోగం సేసి బతుకుదామంటే సదువూ సందె లేదు. నాకున్నదల్లా "కెటిలీ" ఒక్కటే.

పొద్దునే ఆ "కెటిలీ" సుబ్బరంగా తోముకొని పొయ్యి మీద కెక్కిస్తా.... నన్ను నా కుటుంబాన్ని ఆకలి నుండి కాపాడే ధర్మ తల్లి అది. నన్నూ.... నా కొడుకునీ ఈడికి తీసుకొచ్చిన రోజున నేను దిగులుపడలేదు... ఆ కెటిలీ... ఉంటేసాలు... బుతకుతారనుకొన్నా... కానీ నాల్గు రోజుల కిందట పోలీసులు రెయిడ్ చేసి మళ్లీ "కెటిలీ" పట్టుకపొయ్యారంట... ఇదిగో.... సదువుకో... ఉత్తరం అందించాడు వీరయ్య నిర్లిప్తంగా జైలు గోడ వైపు చూస్తూ.

ఉత్తరంలో నాల్గు వాక్యాలున్నాయి. పొగతో ఉక్కిరి బిక్కిరయిన వెంకన్న ఉత్తరం చదవలేకపొయ్యాడు.

డైనింగ్ హాలు నిండా దట్టమైన పొగ.
దేశమంటా ఫాసిస్టు పొగలు... పొగ!

సేకరణ : "ఆంధ్రజ్యోతి" 1981 దీపావళి ప్రత్యేక సంచిక
సంపాదకులు - పురాణం సుబ్రమణ్యా శర్మ